





# స్టార్ త్రినేత్రం

PRGI NO : TGTEL /25/A0438

అనుక్షణం అక్షరసత్యం — తెలుగు దినపత్రిక



వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 241 | ఎడిటర్ : డీ.శివకృష్ణ | గురువారం, 12-2-2026 | పేజీలు: 4 | వెల: 2


WARANGAL VOL-1 ISSUE-241 Editor: D.SHIVAKRIHSNA THURSDAY, 12-2-2026 Pages: 4 Price: 2

Publised From Warangal: Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar & TG All Districts


## ఎగ్జిట్ పోల్స్ లో సంచలనం...

### ఆ రెండు పార్టీల భవిష్యత్ తేల్చేసిన మరో రెండు సర్వే సంస్థలు

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**




తెలంగాణలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ ముగిసింది. దీంతో ఈ ఎన్నికల్లో ఎవరు గెలవబోతు న్నారనే దానిపై ఎగ్జిట్ పోల్స్ ఒక్కొక్కటిగా విడుదలవుతున్నాయి. పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వే కాంగ్రెస్ కే ఆధిపత్యం ఉందని అంచనా వేయగా తాజాగా మరో రెండు సర్వే సంస్థలు తమ అంచనాలను రిలీజ్ చేశాయి. బీకాన్ సంస్థ అంచనాల ప్రకారం కాంగ్రెస్ పార్టీ 80-85 మున్సిపాలిటీలను గెలవబోతోందని అంచనా వేసింది. ఇక బీఆర్ఎస్ 8-10, బీజేపీ 4-6 మున్సిపాలిటీలను కైవసం చేసుకోబోతోందని, 21 మున్సిపాలిటీల్లో హంగ్ లేదా ఇతరులు కైవసం చేసుకోబోతున్నట్లు ప్రిడిక్షన్ ఇచ్చింది.

**ఆపరేషన్ చాణ్యక్య:**
ఆపరేషన్ చాణక్య సర్వే సంస్థ ప్రకారం మొత్తం మున్సిపల్ వార్డుల్లో

▶ మిగతా 2లో

## ఇవాళ భారత్ బంద్

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**



ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా భారత్ బంద్(సార్వత్రిక సమ్మె) జరగనుంది. ప్రధానంగా సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు అయిన CITU, AITUC, INTUC, HMS వంటి సంస్థలు మరియు రైతు సంఘాలు SKM, AIKS, BKU తదితరులు ఈ బంద్ కు పిలుపు నిచ్చాయి. సుమారు 30 కోట్ల మంది ఈ బంద్‌లో పాల్గొనవచ్చని అంచనా వేస్తున్నారు. కార్మికులు, రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలనే ఉద్దేశంతో ఈ ఆందోళన నిర్వహిస్తున్నారు. ఈ బంద్‌కు ముఖ్య కారణాల్లో ఒకటి.. కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్. ఈ కొత్త లేబర్ చట్టాలు కార్మికుల హక్కులను తొలగిస్తున్నాయని, ఉద్యోగ భద్రత తగ్గుతుందని యూనియన్లు ఆరోపిస్తున్నాయి.
అలాగే భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం వల్ల భారతీయ రైతులకు నష్టం కలుగుతుందని, ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌పై ప్రభావం పడుతుందని రైతు సంఘాలు చెబుతున్నాయి. అదనంగా MSPకు చట్టబద్ధ హామీ, ఎలక్ట్రిసిటీ అమెండ్‌మెంట్ బిల్ ఉపసంహరణ, ప్రైవేటీకరణకు వ్యతిరేకత, వేతనాల పెంపు వంటి డిమాండ్లు కూడా ఉన్నాయి.
బంద్ కారణంగా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సేవలైన రోడ్డు, రైలు రవాణా సర్వీసులు కొన్ని ప్రాంతాల్లో నిలిచిపోవచ్చు. ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ సెక్టర్ బ్యాంకులు, కొన్ని మార్కెట్లు మూసివేయబడే అవకాశం ఉంది.

▶ మిగతా 2లో

## కొడంగల్‌లో ఓటు వేసిన సీఎం రేవంత్ రెడ్డి

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**



చెదురుమదురు ఘటనలు మినహా రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ బుధవారం ప్రశాంతంగా కొనసాగింది. సీఎం రేవంత్ రెడ్డి తన సొంత నియోజ క వ ర్గమైన కొడంగల్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ మేరకు ఆయన స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఓటు వేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, పట్టణాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు సీఎం పర్యటన నేపథ్యంలో కొడంగల్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఎస్పీ పోలింగ్ సరళిని పర్యవేక్షించారు.

## మూసీ పునరుజ్జీవనానికి సర్కార్ తొలి అడుగు..

### భూసేకరణకు నోటిఫికేషన్ విడుదల



**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవానికి తొలి అడుగు పడింది. ఈ మేరకు మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నది పరివాహక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించింది. అందుకు సంబంధించి ఇవాళ తెలంగాణ ప్రభుత్వం తాజాగా నోటిఫికేషన్‌ను కూడా జారీ చేసింది.

**తొలి విడతగా 50 ఎకరాల సేకరణ..**
ఈ ప్రాజెక్టులో భాగంగా రంగారెడ్డి జిల్లాలోని గోల్కొండ, గండిపేట మండలాల పరిధిలో సుమారు 50 ఎకరాలకు పైగా భూమిని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సర్వే నంబర్లు, గ్రామాల వారీగా పూర్తి జాబితాను అధికారులు ఇప్పటికే ప్రకటించారు. భూములను కోల్పోతున్న యజమానులకు ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ప్రస్తుత మార్కెట్ విలువ ఆధారంగా భూ యజమానులకు తగిన నష్టపరిహారం చెల్లించనున్నట్లుగా స్పష్టం చేసింది. అయితే, ఈ భూసేకరణపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే, నిర్ణీత గడువులోగా సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా సమర్పించాలని నోటిఫికేషన్‌లో సూచించారు. మొత్తం మూడు జిల్లా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్‌గిరి పరిధిలో ఈ అభివృద్ధి పనులు జరగనున్నాయి. మొత్తం 14 మండలాలు, 46 గ్రామాల పరిధిలో 55 కి. మీటర్ల మేర దశలవారీగా పనులు చేపట్టనున్నారు. మూసీ నది శుద్ధీకరణతో పాటు, ఇరువైపులా పర్యాటక కేంద్రాలు, ఉద్యానవనాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణళికలు రూపొందించింది. భూసేకరణ ప్రక్రియ వేగవంతం కావడంతో త్వరలోనే క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

## ముగిసిన మున్సిపల్ పోలింగ్.. ఫలితాలపై ఉత్కంఠ

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**




తెలంగాణలో మున్సిపల్ పోలింగ్ ముగిసింది. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు సంబంధించి ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ బుధవారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. 5 గంటలలోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. పోలింగ్ సరళి తొలుత ప్రశాంతంగా ప్రారంభమైనప్పటికీ పోలింగ్ ముగిసే సమయానికి రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల ఉద్రిక్తతలు నమోదయ్యాయి. ప్రధాన పార్టీల మధ్య వాగ్వాదాలు, ఘర్షణలు చోటు చేసుకున్నాయి. పలు చోట్ల రాజకీయ పార్టీ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడైనా అదుపుతప్పే పరిస్థితులు ఉంటే వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు పరిస్థితులను అదుపులోకి తీసుకురావడంతో పోలింగ్ ప్రక్రియ అంతా సజావుగా జరిగిపోయింది. ఈ ఎన్నికలకు సంబంధించిన ఓట్లు ఈ నెల 13న లెక్కించనున్నారు.

**బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవిష్యత్:**
మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో తమ జెండా ఎగరేసేందుకు ప్రధాన పార్టీలు నువ్వా నేనా అన్నట్లు ప్రచార పర్వాన్ని సాగించాయి. ప్రత్యర్థులపై మాటల తూటాలు వదులుతు రాజకీయాన్ని రక్తికట్టించాయి. వాదనలు, సవాళ్లతో మొదలైన ప్రచార విలువలకు తిలోదకాలు దిద్దుతూ తిట్లపురాణాల వరకు చేరుకుంది. పార్టీల వ్యూహాలు, హామీలు, ప్రచార సరళిని అంతా గమనించిన ఓటర్లు పార్టీల భవిష్యత్‌ను, అభ్యర్థుల అదృష్టాన్ని ఓటు రూపంలో బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేశారు. ఓటర్లు ఎవరికి పట్టం కట్టారో రేపు తేలనుంది. మొత్తం 116 మున్సిపాలిటీలలోని 2,582 వార్డులకు గాను 12 వార్డులు ఏకగ్రీవం కాగా ఒక చోట వాయిదా పడింది. దీంతో బుధవారం 2569 వార్డులకు పోలింగ్ నిర్వహించారు. ఇక 7 మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించిన 414 వార్డుల్లో 2 వార్డులు ఏకగ్రీవం కాగా మిగిలిన 412 వార్డులకు పోలింగ్ నిర్వహించారు.

**కరీంనగర్‌లో పోలీసుల లాఠీచార్జి:**
కరీంనగర్‌లోని 58వ డివిజన్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జి చేశారు. ఈ ఘటనలో పలువురు బీజేపీ కార్యకర్తలకు గాయాలు కాగా, ఆరుగురు కార్యకర్తల చేతులు విరిగినట్లు సమాచారం. ఈ ఘటనలో కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యక్తిగత ఫోటోగ్రాఫర్‌కు సైతం గాయాలైనట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ నేతలు దొంగ ఓట్లు వేయిస్తున్నారని తాము చెబుతున్నా.. తమపైనే పోలీసులు విచక్షణరహితంగా దాడిచేశారని బీజేపీ నేతలు మండిపడుతున్నారు. పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీజేపీ శ్రేణులు జిల్లా పరిషత్ ముందు రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఘటన స్థలానికి అదనపు పోలీసు బలగాలు చేరుకున్నాయి.

▶ మిగతా 2లో

## ఓటర్లకు మస్కా.. నకిలీ వెండి కాయిన్స్ పంచిన అభ్యర్థి!

**స్టార్ త్రినేత్రం, మేడ్చల్:**



తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు పోలింగ్ బుధవారం ముగిసింది. పలు చోట్ల అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారని ప్రత్యర్థులు ఆరోపించారు. ఈ క్రమంలో మేడ్చల్ జిల్లా అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో ఎన్నికల వేళ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ పార్టీ 5వ వార్డు అభ్యర్థి మాలతి మాధవరెడ్డి నకిలీ వెండి నాణేలను

▶ మిగతా 2లో

## మున్సిపల్ ఎన్నికల వేళ కీలక పరిణామం

### రాష్ట్రంలో భారీగా IAS అధికారుల బదిలీ

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**





తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. పరిపాలనా సౌలభ్యం కోసం పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఉన్న జ్యోతి బుద్ధ ప్రకాష్‌ను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (SCCL) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. ఇప్పటి వరకు అక్కడ పూర్తి అదనపు బాధ్యతల్లో ఉన్న డి.కృష్ణ భాస్కర్‌ను ఆ బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పించింది. ఇక సీనియర్ ఐఏఎస్ అధికారి సబ్యసాచి ఘోష్ ప్రస్తుతం ఉన్న బాధ్యతలతో పాటు, ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు.

▶ మిగతా 2లో

## మూడు గ్రేటర్ కార్పొరేషన్లకు కమిషనర్ల నియామకం

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**




గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ అధికారిక ఉత్తర్వులు బుధవారం జారీ అయ్యాయి. అందులో జీహెచ్ఎంసీతో పాటు మల్కాజ్‌గిరి, సైబరాబాద్ కార్పొరేషన్లు ఉన్నాయి. ఈ క్రమంలోనే ఆ మూడు కార్పొరేషన్లకు తాజాగా కమిషనర్లను కూడా నియమించారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్‌వీ కర్ణన్‌ను యథావిధిగా కొనసాగించనున్నారు. ఇక సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా శ్రీజన, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ కమిషనర్‌గా వినయ్ కృష్ణారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణా రావు ఉత్తర్వులు జారీ చేశారు.

## శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులకు ఆర్టీసీ తీపి కబురు

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**



మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం స్పెషల్ సర్వీసులను నడుపుబోతున్నట్లు టీజీఎస్ఆర్టీసీ తెలిపింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు 2,243 ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించిందని ఈ నెల 15న మహా శివరాత్రి కాగా, ఈనెల 14 నుంచి 16వ తేది వరకు ఈ ప్రత్యేక బస్సులను సంస్థ నడపబోతున్నదని బుధారం ఓ ప్రకటనలో పేర్కొంది. శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71తో పాటు రాష్ట్రంలోని కొమురవెల్లి, అలంపూర్, ఉమా మహేశ్వరం, పాలకుర్తి, రామప్ప, తదితర ఆలయాలకు 273 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేపీహెచ్‌బీ, బీహెచ్ఈఎల్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు భక్తులకు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేసింది. ఈ మేరకు శివరాత్రి ఆపరేషన్స్ పై ఉన్నతాధికారులతో సంస్థ వీసీ & ఎండీ వై.నాగిరెడ్డి ఇప్పటికే సమీక్ష నిర్వహించి శివరాత్రి పండుగకు శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. గత శివరాత్రి కన్నా ఈ సారి 208 బస్సులను అదనంగా సంస్థ నడపనుంది. భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని క్షేత్ర స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

▶ మిగతా 2లో

వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 241 | ఎడిటర్ : డీ.శివకృష్ణ | గురువారం, 12-2-2026 | పేజీలు: 4 | వెల: 2
WARANGAL VOL-1 ISSUE-241 Editor: D.SHIVAKRIHSNA THURSDAY, 12-2-2026 Pages: 4 Price: 2

మొదటిపేజీ తరువాయి

# శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులకు ఆర్టీసీ తీపి కబురు

**చార్జీల్లో సవరణ:**
రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం శివరాత్రికి నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో 1.5 టైమ్స్ వరకు టికెట్ ధరలను సవరించినట్లు పేర్కొంది. రెగ్యులర్ సర్వీస్‌లో టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదని ఈ నెల 14 నుంచి 16 తేదీ వరకు (మూడు రోజులు) నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరణ టికెట్ ఛార్జీలు అమలవుతాయని తెలిపింది. ఏడుపాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 15 వ తేదీ నుంచి 17 తేదీ వరకు(మూడు రోజులు) సవరణ చార్జీలు వర్తిస్తాయని తెలిపారు. మహాశివరాత్రి స్పెషల్ బస్సుల్లో రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు రాష్ట్రంలో ప్రయాణానికి ఉచిత బస్సు రవాణా సదుపాయం యధావిధిగా అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. తమ ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని సూచించారు. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డ్ లను ఏర్పాటు చేస్తామని తెలిపింది.

**ముందస్తు రిజర్వేషన్ కు చాన్స్:**
హైదరాబాద్ నుంచి శ్రీశైలంకు వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించామని ఆర్టీసీ తెలిపింది. టికెట్ల బుకింగ్ ను www.tgsrtcbus.in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చని, మహా శివరాత్రి స్పెషల్ బస్సులకు సంబంధించిన సమాచారం కోసం టీజీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-234500332లలో సంప్రదించాలని సూచించింది.

# ఇవాళ భారత్ బంద్

స్కూళ్లు, కాలేజీలు అధికారికంగా సెలవు ప్రకటించకపోయినా.. బస్సులు నిలిచిపోతే అవి కూడా తెరుచుకోకపోవచ్చు. ఆసుపత్రులు, అంబులెన్స్, ఫైర్ సర్వీసులు వంటి అత్యవసర సేవలు కొనసాగుతాయి. ప్రైవేట్ ఆఫీసులు, IT కంపెనీలు సాధారణంగానే పని చేసే అవకాశం ఉంది.

# ఎగ్జిట్ పోల్స్ లో సంచలనం...

**ఆ రెండు పార్టీల భవిష్యత్ తేల్చేసిన మరో రెండు సర్వే సంస్థలు**

కాంగ్రెస్ 1400-1449 (48.0శాతం) వార్డులలో, బీఆర్ఎస్ 745 -793 (26.06శాతం), బీజేపీ 358-399 (13.04శాతం), ఎంఐఎం 150-187(6.03శాతం), జనసేన 30-35 (1.02 శాతం) ఇతరులు80-119(4శాతం) కైవసం చేసుకోబోతున్నట్లు తేల్చింది.
పురపోరులో తమ సత్తా చాటుతామని ప్రధాన పార్టీలు సవాళ్లు చేసినప్పటికీ ఓటర్లను మెప్పించడంలో ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు వెనుకబడి పోయాయని ఈ సర్వే అంచనాలు స్పష్టం చేశాయి. ఇక ఆపరేషన్ చాణక్య ప్రకారం జనసేన 30-35 స్థానాల్లో బోణీ కొట్టబోతోందని అంచనా వేయడం ఆసక్తిగా మారింది. మరి ఈ ఎగ్జిట్ పోల్స్ ఎగ్జాట్ గా వస్తాయా లేక తారుమారు అవుతాయా అనేది ఎల్లుండి తేలనుంది.

# ముగిసిన మున్సిపల్ పోలింగ్.. ఫలితాలపై ఉత్కంఠ

**దొంగఓట్లు వేస్తూ బక్..**
మరోవైపు కరీంనగర్‌లోని 34వ డివిజన్‌లో దొంగ ఓట్లు వేస్తున్న వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. హుస్సేనీపుర ప్రాంతంలోని సూఫా కాన్వెంట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఒక ఇండిపెండెంట్ అభ్యర్థికి సంబంధించిన యువకులు దొంగ ఓట్లు వేస్తూ పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్న పోలీసులు, వారిని స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎంఐఎం పార్టీ అభ్యర్థి మహమ్మద్ ఖాజా మజారుద్దీన్ తీవ్రంగా స్పందించారు. తనను ఓడించాలనే కుట్రతో ఇండిపెండెంట్ అభ్యర్థి సమీనా పర్వీన్ తరఫున దొంగ ఓట్లు వేయించారని ఆరోపించారు. ఈ బూత్‌లో జరిగిన అక్రమాల నేపథ్యంలో రీపోలింగ్ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. దొంగ ఓట్ల వెనుక మాజీ యూత్ కాంగ్రెస్ నాయకుడు శానవాజ్, బొమ్మకల్ మాజీ ఉపసర్పంచ్ జమ్మూ ఇష్తియాక్ పాత్ర ఉందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టుబడ్డ యువకుల పేర్లు ఎండి మొహీబుద్దీన్, ఎండి నజీబుద్దిన్‌గా పోలీసులు గుర్తించారు. వీరిలో ఒకరు ఖాన్‌పురా, మరొకరు సలఫీ నగర్‌కు చెందినవారిగా సమాచారం.

# ఓటర్లకు మస్కా.. నకిలీ వెండి కాయిన్స్ పంచిన అభ్యర్థి!

పంచుతూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారంటూ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు దశరథ్ ఆరోపించారు. ఈ సందర్భంగా మీడియాతో దశరథ్ మాట్లాడుతూ.. ఓటర్లను మోసం చేసే ప్రయత్నం జరిగిందని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ బుధవారం తెల్లవారుజామున ఓటర్లకు నకిలీ సిల్వర్ కాయిన్స్ పంపిణీ చేశారని ఆరోపించారు. ఈ ప్రలోభాల విషయంలో ఎన్నికల సంఘం అధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి మాలతి మాధవరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆరోపించారు.

# మున్సిపల్ ఎన్నికల వేళ కీలక పరిణామం

గిరిజన సంక్షేమ శాఖ బాధ్యతల్లో కూడా ఆయనే కొనసాగుతారు. పి.కాత్యాయని దేవిని ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా బదిలీ చేశారు. దీంతో పాటు ఆమె స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా కొనసాగుతారు.
సీనియర్ ఐఏఎస్ సందీప్ కుమార్ సుల్తానియాకు ప్లానింగ్ విభాగంతో పాటు తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ (TGRAC) డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. దివ్య దేవరాజన్ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు. మయాంక్ మిట్టల్ జలమండలి (HMWS&SB) జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. చివరగా రఘురామ్ శర్మను పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు ఉత్తర్వులు జారీ చేశారు.

# బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని బహిరంగ ఉరితీయాలి

- హైదరాబాదులో సఖి మహిళా మండలి సోదరీమణుల నిరసన ప్రదర్శన
- ఇలాంటి సంఘటనలపై ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకోవాలి




స్టార్ త్రినేత్రం, ఎల్బీనగర్: ఎల్బీనగర్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద సఖీ సోదరిమణులు కొవ్వొత్తులతో భారీ ఎత్తున నిరసన ప్రదర్శన చేయడం జరిగింది. బీహార్ రాష్ట్రంలో వికాస్ మహతోష్ అనే దుర్మార్గుడు అభం శుభం తెలియని చిన్నారిని అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటన కు నిరసనగా హైదరాబాద్ సఖి సోదరిమణులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది.భారతదేశంలో బాల బాలికలపై అత్యాచారాలు, మానభంగాలు, యాసిడ్ దాడులు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు చేయడం వంటి దుర్మార్గమైన పనులు చేస్తున్న నరహంతకులను పబ్లిక్ లో ఉరితీయాలని హైదరాబాద్ సఖి మహిళా మండలి డిమాండ్ చేస్తున్నది. భారత పార్లమెంట్లో పబ్లిక్ లో ఉరి తీసే చట్టాలను తీసుకురావాలని అందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని మహిళలపై దాడి చేయాలన్నా, మానభంగాలు చేయాలన్నా, హత్యలు చేయాలన్నా గజగజ వనికి పోవాలని, అటువంటి బలమైన చట్టాలను పార్లమెంట్లో తీసుకురావాలని హైదరాబాద్ సఖి మహిళా మండలి డిమాండ్ చేస్తున్నది.భారతదేశంలో స్త్రీలకు స్వేచ్ఛ లేదు. భారతదేశంలో స్త్రీ ఒంటరిగా తిరిగే స్వాతంత్రం రాలేదు. ఒంటరిగా వెళ్లిన మహిళ లేదా బాలిక తిరిగి వచ్చేదాకా నమ్మకము లేని దుర్భర దారిద్రేస్థితిలో మనం జీవిస్తున్నాం. సమాజం తలదించుకోవలసిన పరిస్థితి నెలకొంది.మహిళలపై బాలికలపై అత్యాచారాలు చేస్తూ, మానభంగాలు చేస్తూ, మహిళలను కిరాతకంగా చంపి వేస్తున్న దుర్మార్గులను నడిరోడ్డులో ఉరి తీసే చట్టాలను పార్లమెంట్లో అమలు చేయాలని హైదరాబాద్ సఖి మహిళా మండలి డిమాండ్ చేస్తున్నది.ఈ కార్యక్రమంలో సఖి మహిళా మండలి సోదరీమణులు కదారి అన్నపూర్ణ యాదవ్, ఎం సంగీత, పట్నాల సావిత్రి, రజిత, లక్ష్మి, అనిశెట్టి లక్ష్మీ యాదవ్, బత్తుల వరలక్ష్మి యాదవ్, పిట్ట కడప రాణి, వనిత, అనసూయ, మంజుల, లక్ష్మి, పుణ్య, ఉదయ తదితర సోదరీమణులు పాల్గొన్నారు

# ఓటర్లను ఆకర్షించేందుకు హరిత పోలింగ్ కేంద్రం



**స్టార్ త్రినేత్రం, వర్ధన్నపేట:**
వర్ధన్నపేట పట్టణంలో జిల్లా కలెక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు హరిత పోలింగ్ కేంద్రాన్ని స్థానిక అధికారులు ఏర్పాటు చేశారు. పర్యావరణ హితంగా రూపొందించిన ఈ కేంద్రం ప్రత్యేక అలంకరణలు, పచ్చదనం థీమ్‌తో ఓటర్లను ఆకర్షించింది. ఓటు వేయడానికి వచ్చిన ప్రజలు హరిత సందేశంతో చేసిన ఏర్పాట్లను ఆసక్తిగా వీక్షించారు. ఇది పర్యావరణంపై అవగాహన పెంచే ప్రయత్నమని అధికారులు బుధవారం తెలిపారు.

# వరంగల్ జిల్లాలో ప్రశాంతంగా మున్సిపాలిటీ ఎన్నికలు

- వర్ధన్నపేట మున్సిపాలిటీలో పోలింగ్ 86.23 శాతంగా నమోదు
- నర్సంపేట మున్సిపాలిటీలో పోలింగ్ 85.21 శాతం
- వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**స్టార్ త్రినేత్రం, వరంగల్:**
వరంగల్ జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీలలో బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. నర్సంపేట మున్సిపాలిటీకి సంబంధించి 30 వార్డులు ఉండగా 60 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ 85.21 శాతం, అదేవిధంగా వర్ధన్నపేట మున్సిపాలిటీకి 86.23 పోలింగ్ శాతం నమోదైనట్లు వెల్లడించారు. నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో మొత్తం ఓటర్లు 40,968 మంది ఉండగా 34,908 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు.
అదేవిధంగా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 12 వార్డులలో 20 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ 10,526 మంది ఓటర్లు ఉండగా ఎన్నికలలో 9,077 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారని పేర్కొన్నారు. రెండు మున్సిపాలిటీలలోని మొత్తం 80 పోలింగ్ కేంద్రాలలో సిసీ కెమెరాలను ఏర్పాటు చేసి కలెక్టరేట్ నుండి పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా నిశితంగా పరిశీలించారు. ఆరు సమస్యాత్మక పోలింగ్ లొకేషన్లలో పోలింగ్ ప్రశాంతంగా సాగేందుకు 17మంది సూక్ష్మ పరిశీలకులను నియమించినట్లు తెలిపారు. నర్సంపేట మున్సిపాలిటీ వార్డులలో పోలింగ్ నిర్వహణ అనంతరం బ్యాలెట్ బాక్స్లను, పోలింగ్ సామగ్రిని నర్సంపేటలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. వర్ధన్నపేట మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు బ్యాలెట్ బాక్స్ లు, పోలింగ్ సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు నుండి పోలీస్ భద్రత మధ్య తరలించారు.
ఎన్నికల నిర్వహణలో సహకరించిన ఎన్నికల సిబ్బంది, పోలీసు శాఖ, అధికారులు, ముఖ్యంగా ప్రజాస్వామ్య పండుగలో భాగస్వాములైన ఓటర్లకు జిల్లా ఎన్నికల అధికారి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసేలా అధిక శాతం పోలింగ్ నమోదు కావడం సంతోషకరమని కలెక్టర్ పేర్కొన్నారు.

# నేడు అబ్దుల్లాపూర్ మెట్‌లో 'కళ్యాణ లక్ష్మి / షాదీ ముబారక్' చెక్కుల పంపిణీ

**అబ్దుల్లాపూర్మెట్ తహశీల్దార్ సుదర్శన్ రెడ్డి**



స్టార్ త్రినేత్రం, అబ్దుల్లాపూర్ మెట్: అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నేడు మండల కేంద్రంలోని శివ గార్డెన్ లో ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నట్లు మండల తహశీల్దార్ సుదర్శన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారని తహశీల్దార్ సుదర్శన్ రెడ్డి తెలియజేశారు . మండలంలోని అన్ని గ్రామాల నుండి ఎంపికైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నిర్ణీత సమయానికి వేదిక వద్దకు చేరుకోవాలని తహశీల్దార్ సూచించారు. చెక్కులు తీసుకునే వారు తమ వెంట అవసరమైన ధృవీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ పంపిణీ కార్యక్రమానికి లబ్ధిదారులందరూ సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# ఓటు హక్కు వినియోగం.. పర్యావరణ పరిరక్షణకు సంకల్పం

- ప్రజాస్వామ్య పండుగకు పచ్చని అలంకారం
- కలెక్టర్ సత్య శారద

**స్టార్ త్రినేత్రం, వరంగల్/వర్ధన్నపేట/నర్సంపేట:**





మునిసిపల్ ఎన్నికలను ప్రజాస్వామ్యానికి పచ్చని పండుగగా మార్చాలనే లక్ష్యంతో వరంగల్ జిల్లా పరిపాలన వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. పోలింగ్ శాతాన్ని పెంచడంతో పాటు ఓటర్లలో పర్యావరణ చైతన్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన హరిత, పర్యావరణ హిత పోలింగ్ స్టేషన్లను బుధవారం వర్ధన్నపేట, నర్సంపేట పట్టణాలలో కలెక్టర్ స్వయంగా సందర్శించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజలకు చేరువ చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించేందుకు హరిత పోలింగ్ కేంద్రాలు, ప్లాస్టిక్ రీసైక్లింగ్ విధానం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, శానిటేషన్ అంశాలతో ప్రత్యేక పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
వర్ధన్నపేట పట్టణంలోని ఫిరంగిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన హరిత పోలింగ్ కేంద్రం పచ్చదనం, పరిశుభ్రత, పర్యావరణహిత అలంకరణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్లాస్టిక్ రీసైక్లింగ్ అంశంతో రూపొందించిన ప్రత్యేక స్టేషన్‌లో అవగాహన బోర్డులు, సందేశాలు ఓటర్లను ఆలోచింపజేశాయి. ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకొని, ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ల వద్ద ప్రజాస్వామ్య క్షణాలను స్మరించుకున్నారు. ఓటు వేసిన ప్రతి ఓటరికి కలెక్టర్ పెన్‌తో పాటు "ఓటు" రిస్ట్ బ్యాండ్ అందించడం విశేషంగా నిలిచింది.
నర్సంపేట పట్టణంలో ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హరిత పోలింగ్ స్టేషన్, బొందబడి ప్రభుత్వ పాఠశాలలో ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్రత్యేక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో నిత్యావసర వస్తువుల తయారీ ప్రదర్శనలు ఏర్పాటు చేసి, పునర్వినియోగ ప్రాధాన్యతను చాటి చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరాన్ని వివరించే సందేశాలు ప్రజల్లో చైతన్యం రేకెత్తించాయి.
ఈ ప్రత్యేక ఏర్పాట్ల ద్వారా ఓటింగ్ ప్రక్రియను మరింత ఆహ్లాదకరంగా, బాధ్యతాయుతంగా మార్చడమే కాకుండా పోలింగ్ శాతాన్ని పెంచడమే ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. "ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి బలమైన పునాది. ఓటు వేయడం మన హక్కు మాత్రమే కాదు, మన భవిష్యత్తు పట్ల మన బాధ్యత కూడా" అని ఆమె అన్నారు. ఈ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు వల్ల వోటింగ్ శాతం పెరుగుతుందని కలెక్టర్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.
అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, ఆర్డీవోలు సుమా, ఉమారాణి, జిల్లా నోడల్ అధికారులు భాగ్యలక్ష్మి, పుష్పలత, తహశీల్దార్లు విజయ్, రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో హనుమాజీపేట గ్రామంలో ఘనంగా 90వ త్రిమూర్తి శివజయంతి వేడుకలు




స్టార్ త్రినేత్రం, వేములవాడ: వేములవాడ రూరల్ మండలం హనుమాజీపేట గ్రామంలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఘనంగా 90 వ త్రిమూర్తి శివ జయంతి వేడుకలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా వేములవాడ సెంటర్ ఇన్చార్జి బి కే రమాదేవి శివరాత్రి పండగ విశేషత గురించి శివ పరమాత్ముని ఆధ్యాత్మిక జ్ఞానాన్ని భక్తులకు వివరించారు అనంతరం శివ పరమాత్మ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు ఈ కార్యక్రమంలో వేములవాడ సెంటర్ ఇన్చార్జి బికే రమాదేవి, బికే నళిని, హనుమాజీపేట గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# ప్రభుత్వ మార్పుతో రాష్ట్ర పురోగతికి విఘాతం..

## గవర్నర్ అబ్దుల్ నజీర్ సంచలన వ్యాఖ్యలు

**స్టార్ త్రినేత్రం, అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఇవాళ ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ఎన్నో సవాళ్లను తట్టుకుని నిలబడగలిగిందని కితాబిచ్చారు.



**2019 తర్వాత వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు..**

దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వ పాలన కొనసాగుతోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. పరిమిత వనరులు ఉన్నప్పటికీ గతంలో (2014-19) అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. 2019లో జరిగిన ప్రభుత్వ మార్పు ఈ పురోగతికి విఘాతం కలిగించిందని వ్యాఖ్యానించారు. 2019 తర్వాత వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు తలెత్తాయని అన్నారు. దీంతో రాష్ట్ర అభివృద్ధి స్తంభించిందని, ఆర్థిక ఒత్తిడి తీవ్రమై వ్యవస్థలు పూర్తిగా విధ్వంసమయ్యాయని గవర్నర్ పేర్కొన్నారు.

**ప్రగతిపథం వైపు ప్రయాణం..**

2019 తర్వాత రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు, విద్యుత్, సాగునీటిపారుదల రంగాలు తీవ్ర తిరోగమనం చెందాయని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. చేదు అనుభవాలతో విసిగివేసారిన ఏపీ ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని తెలిపారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం పునరుద్ధరణ దశ నుంచి ప్రగతిపథం వైపు పయనిస్తోందని అన్నారు. సూపర్-6 ఇతర సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని అన్నారు. ప్రస్తుతం అభివృద్ధి కార్యకలాపాలను పునఃప్రారంభించడంపైనే ప్రధానంగా దృష్టి పెట్టామని గవర్నర్ తెలిపారు. రాష్ట్రానికి జీవధార అయిన పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు వేగంగా పనులు చేస్తున్నాయని గవర్నర్ పేర్కొన్నారు.

**రూ.308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థ నిర్మాణమే లక్ష్యం..**

విధానాలు, వ్యవస్థలు, వ్యయ ప్రాధాన్యతలలో కీలక సవరణలు చేశామని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. దీర్ఘకాలిక దార్శనికతతో కూడిన పూర్తి స్థాయి బడ్జెట్‌ను సమర్పించామని తెలిపారు. 7 శ్వేతపత్రాల విడుదల ద్వారా పారదర్శకతకు పెద్దపీట వేశామని అన్నారు. సంక్షేమాన్ని అభివృద్ధితో సమతుల్యం చేయడానికి 10 సూత్రాలు రూపొందించామని స్పష్టం చేశారు. సంపదను సృష్టించే ప్రగతి చక్రాన్ని నిర్మించడమే కాకుండా పది సూత్రాల లక్ష్యాన్ని పెట్టుకున్నామని అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ ఒక స్పష్టమైన ఆర్థిక మార్గాన్ని నిర్దేశించిందని తెలిపారు. 2047 నాటికి రూ.308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థ నిర్మాణంతో పాటు రూ.55 లక్షల తలసరి ఆదాయం సాధించడమే లక్ష్యమని అన్నారు.

బలహీన వర్గాలు మహిళల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేస్తూ, సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత కోసం డిజిటల్ విధానాన్ని ప్రారంభించామని గవర్నర్ తెలిపారు. పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 205 అన్న క్యాంటీన్లను నిర్వహిస్తున్నామని, త్వరలోనే మరిన్ని క్యాంటీన్లను అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. 'స్వర్ణాంధ్ర 2047 విజన్' ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ఇళ్లు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, గిరిజన మైనార్టీ వర్గాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నట్లుగా పేర్కొన్నారు.

ఆర్థిక వృద్ధి, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ఏపీని ఐటీ హబ్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని, చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తూనే యువతకు పెద్దపీట వేస్తూ ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించామని గవర్నర్ వివరించారు. విద్యారంగంలో భాగంగా టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను అప్‌గ్రేడ్ చేస్తున్నామని, జాతీయస్థాయి విద్యాసంస్థల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పేదల వైద్యం కోసం యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ ద్వారా ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల వరకు ఆరోగ్య భరోసా కల్పిస్తామని, 'తల్లికి వందనం' పథకాన్ని పక్కాగా అమలు చేస్తున్నామని చెప్పారు. చివరగా, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్యాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు గవర్నర్ ప్రకటించారు.

రాష్ట్రంలో నిరంతర అధిక వృద్ధి రేటుపై దృష్టి సారించామని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా లక్ష్యాలను సవరించుకుంటున్నామని పేర్కొన్నారు. క్వాంటం కంప్యూటింగ్ వంటి అత్యాధునిక రంగాల్లో ఏపీ అడుగులు వేయడం ఆనందదాయకమని గవర్నర్ కొనియాడారు.

# మంత్రి కందుల దుర్గేశ్‌కు షాక్..

## డైరెక్ట్‌గా పేషీకి మావోయిస్టుల బెదిరింపు లేఖ

**స్టార్ త్రినేత్రం, అమరావతి :**




ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ కు మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖ రావడం రాష్ట్ర వ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. సాధారణంగా అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి పేషీకే ఈ లేఖ నేరుగా రావడం అధికారులను విస్మయానికి గురిచేస్తోంది. నిషేధిత మావోయిస్టు పార్టీ పేరుతో ఉన్న ఈ లేఖలో మంత్రి దుర్గేశ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను కూడా హతమారుస్తామని తీవ్రంగా హెచ్చరించినట్లు సమాచారం. తాజా, బెదిరింపు లేఖపై మంత్రి కార్యాలయ సిబ్బంది వెంటనే అలర్ట్ అయ్యారు. గుంటూరు జిల్లాలోని తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో దీనిపై అధికారికంగా ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఈ లేఖ ఎక్కడి నుంచి పోస్ట్ చేశారు.. సచివాలయంలోకి ఇది ఎలా చేరింది? అనే కోణంలో సీసీటీవీ ఫుటేజ్, పోస్టల్ రికార్డులను పరిశీలిస్తున్నారు. ఇది నిజంగానే మావోయిస్టులు పంపారా..? లేక ఎవరైనా ఆకతాయిలు మంత్రిని భయపెట్టేందుకు మావోయిస్టుల పేరును వాడుకున్నారా.. అన్నది తేల్చేందుకు ఫోరెన్సిక్, నిఘా వర్గాలు రంగంలోకి దిగాయి.

**మంత్రికి భద్రత పెంచే అవకాశం..**

మావోయిస్టుల బెదిదింపు లేఖ నేపథ్యంలో మంత్రి కందుల దుర్గేశ్‌కు ప్రభుత్వం భద్రతను మరింత కట్టుదిట్టం చేసే అవకాశం ఉంది. ఆయన నివాసం, పర్యటనల వద్ద పోలీసు పహారాను పెంచాలని ఉన్నతాధికారులు నిర్ణయించినట్లుగా తెలుస్తోంది.

# జనరల్ నరవణే పుస్తక వివాదం.. పబ్లిషింగ్ హౌస్ 'పెంగ్విన్'కు ఢిల్లీ పోలీసుల నోటీసులు




**స్టార్ త్రినేత్రం, ఢిల్లీ :**


మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎం.ఎం.నరవణే రాసిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' అనే ప్రచురితం కాని ఆత్మకథకు సంబంధించి ఢిల్లీ పోలీసులు పబ్లిషింగ్ హౌస్ పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా కు నోటీసులు జారీ చేశారు. అయితే, ఇప్పటికే అసలు ఆ పుస్తకం ప్రింటింగ్ ఎలా జరిగింది..? క్లియరెన్స్ రాక ముందే ప్రతులు ఎలా బయటకు వచ్చాయి..? అనే విషయాలపై వివరణ ఇవ్వాలని ఢిల్లీ పోలీసులు పెంగ్విన్ ఇండియాను సూచనాప్రాయంగా కోరారు. ఈ పుస్తకంలో అగ్నిపథ్ పథకం, చైనాతో సరిహద్దు ఉద్రిక్తతల గురించి సంచలన విషయాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. దీంతో అధికారిక రహస్యాల చట్టం ఏమైనా ఉల్లంఘించబడిందా అన్న కోణంలో పోలీసులు లోతుగా విచారణ చేపడుతున్నారు.

కాగా, మాజీ ఆర్మీ చీఫ్ రాసిన పుస్తకం అధికారికంగా విడుదల కాలేదు. జాతీయ భద్రత, ముఖ్యంగా 2020 నాటి గాల్వన్ లోయ ఘర్షణలకు సంబంధించిన సున్నితమైన అంశాలు ఇందులో ఉన్నందున ప్రభుత్వం దీనిపై సమీక్ష నిర్వహిస్తోంది. ముఖ్యంగా లోక్‌సభలో లోక్‌సభా పక్ష నేత రాహుల్ గాంధీ ఈ పుస్తకం గురించి ప్రస్తావించడం, పుస్తకం ప్రతిని పట్టుకుని పార్లమెంట్ ఆవరణలో హల్‌చల్ చేయడంతో వివాదం మరింత ముదిరింది.

# అప్పుల ఊబిలో తెలుగు రాష్ట్రాల రైతులు..

## కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కీలక ప్రకటన

**స్టార్ త్రినేత్రం, ఢిల్లీ :**



రైతుల అప్పులపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కీలక ప్రకటన చేశారు. మంగళవారం లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. రైతులు అధిక అప్పులు తీసుకున్న రాష్ట్రాల జాబితాను వెల్లడించారు. మొదటి స్థానంలో ఆంధ్రప్రదేశ్, ఐదో స్థానంలో తెలంగాణ ఉన్నట్లు తెలిపారు. దేశంలోనే ఏపీ రైతులపై అధిక అప్పుల భారం ఉన్నట్లు చెప్పారు. జూలై 2018 నుంచి జూన్ 2019 మధ్య ఏపీ రైతు సగటు అప్పు రూ.2,35,554, తెలంగాణ రైతు సగటు అప్పు రూ.1,52,113 ఉన్నట్లు స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే.. దేశఆర్థిక వ్యవస్థకు మూలం గ్రామీణ, వ్యవసాయ రంగాలే. 1991 తర్వాత చేపడుతున్న ఆర్థిక సంస్కరణలు ఇండియాను ప్రపంచంలోనే ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మలిచినా, వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతుండటంతో దేశంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడటం లేదు. మరోవైపు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. రుణమాఫీ, MSP వంటి ఉపశమన చర్యలు సమస్య మూల కారణాలను పరిష్కరించలేకపోతున్నాయి.

# భక్తుల పట్ల ఎవరూ అగౌరవంగా ప్రవర్తించకూడదు

## సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

**స్టార్ త్రినేత్రం, అమరావతి :**

శ్రీశైలం మహాక్షేత్రంతో పాటు రాష్ట్రంలోని ప్రముఖ శివాలయాల్లో భక్తుల రద్దీ, సౌకర్యాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం, అక్కడి నుంచే మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. శ్రీశైలం బ్రహ్మోత్సవాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

**భక్తుల పట్ల మర్యాదగా ఉండాలి!**

మహాశివరాత్రి పర్వదినం దగ్గర పడుతుండటంతో శ్రీశైలంలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ముఖ్యంగా మాలధారణలు, దీక్షలతో ఎంతో కష్టపడి కాలినడకన వచ్చే భక్తుల పట్ల ఎవరూ అగౌరవంగా ప్రవర్తించకూడదని హితవు పలికారు.



భక్తులకు త్వరితగతిన స్వామివారి దర్శనం కల్పించడంతో పాటు, తాగునీరు, వసతి కల్పనలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని స్పష్టం చేశారు.

**మంత్రులు, అధికారులకు దిశానిర్దేశం**

దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోం మంత్రి అనిత ప్రత్యేక శ్రద్ధ వహించి ఏర్పాట్లను పర్యవేక్షించాలని సీఎం సూచించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు క్యూలైన్లలో ఇబ్బంది లేకుండా చూడాలి. అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేసేలా పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. రద్దీ దృష్ట్యా డీజీపీ నేతృత్వంలో పోలీస్ యంత్రాంగం పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా భవిష్యత్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, శివరాత్రి వేడుకలు ఘనంగా, భక్తులకు సంతృప్తికరంగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.

# పోలీస్ స్టేషన్లో బంగారం మాయం.. ఇంటి దొంగల పనేనా?

స్టార్ త్రినేత్రం, అమరావతి : ఇంట్లో దొంగతనం జరిగితే పోలీసుల దగ్గరికి వెళ్తాం. మరి పోలీస్ స్టేషన్లోనే దొంగతనం జరిగితే ఏం చేస్తారు? వాళ్లెక్కడికి వెళ్తారు? తాజాగా గుంటూరు జిల్లా పొన్నూరు పోలీస్ స్టేషన్లో 150 గ్రాముల బంగారం మాయమైంది. ఓ వ్యాపారి హత్య సమయంలో స్వాధీనం చేసుకున్న బంగారాన్ని కోర్టు ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్లోనే భద్రపరిచారు. తాజాగా మరో కేసులో వస్తువుల్ని భద్రపరుస్తున్న క్రమంలో.. బంగారం పోయినట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పుడున్న రేటు ప్రకారం మాయమైన బంగారం విలువ సుమారు రూ.23 లక్షల విలువ ఉంటుందని తెలుస్తోంది. ఈ ఘటనపై ఉన్నత అధికారులు స్టేషన్ పోలీసుల్ని రహస్యంగా విచారణ చేస్తున్నట్లు సమాచారం. బయటి వ్యక్తులు లాకర్ వరకూ వెళ్లే అవకాశం తక్కువగా ఉండటంతో.. ఇది ఇంటిదొంగల పనేనా ? అన్న కోణంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# శ్రీశైలం ఘటన.. నేషనల్ హ్యూమన్ రైట్స్‌కు ఫిర్యాదు



స్టార్ త్రినేత్రం, అమరావతి : శ్రీశైలంలో ఇటీవల శివ స్వాములపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం కలకలం రేపింది. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఇతర మంత్రులు సీరియస్ అయ్యారు. భక్తులపై పోలీసులు అధికార జులుం ప్రదర్శించడం తగదని హెచ్చరించారు. తాజాగా ఈ అంశంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. శివస్వాములపై పోలీసులు లాఠీచార్జ్ చేయడంపై నంద్యాల సీనియర్ న్యాయవాది ఫణీంద్రనాథ్ నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ కు ఫిర్యాదు చేశారు. దీక్షపూర్తిచేసి ఇరుముడితో శివయ్య దర్శనానికి వచ్చిన స్వాములపై లాఠీచార్జ్ చేయడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు, శివస్వాముల దీక్ష విమరణ సమయంలో ఆలయంలో భక్తుల రద్దీని నియంత్రించే చర్యలు చేపట్టక పోవడం దారుణన్నారు. పైగా 12 గంటలపాటు స్వాములకు దర్శనం కల్పించకుండా వీఐపీలకు ఇంపార్టెన్స్ ఇవ్వడాన్ని తప్పుపట్టారు. దీనిపై పోలీసులు, ఆలయ పాలకమండలిపై న్యాయవాది ఫణీంద్రనాథ్ NHRCకి ఫిర్యాదు చేశారు. దీనిపై సంస్థ ఎలా స్పందిస్తుందో, ఎవరిపై చర్యలు తీసుకుంటుందో చూడాలి. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది.

# వివాదాస్పదంగా మారిన ప్రభుత్వం 'కమ్మ'గానే ఉంది వ్యాఖ్యలు: ఎమ్మెల్యే వివరణ



స్టార్ త్రినేత్రం, అమరావతి : ప్రభుత్వం ఇంకా కమ్మగానే ఉంది. కమ్మ సామాజికవర్గ నేతల ఆధిపత్యమే కొనసాగుతోంది. కులాలకు సంబంధం లేకుండా అందరినీ సమానంగా చూడాలి. ప్రభుత్వంలో కేవలం ఒకే సామాజిక వర్గానికి ప్రాధాన్యత దక్కడం సరికాదు అని జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వ్యాఖ్యలకు ఆదినారాయణ రెడ్డి వివరణ ఇచ్చారు. మంగళవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు.

**కూటమిలో కుట్రకు జగన్ ప్లాన్**

కూటమిని విడదీయాలని జగన్ కుట్రలు చేస్తున్నారు. కావాలనే నా వ్యాఖ్యలను వక్రీకరించి కూటమి మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారు. నా మాటలను వక్రీకరించి రకరకాలుగా ప్రచారం చేస్తున్నారు. కమ్మటి రాజ్యం అంటే బాగుండాలనేదే నా ఉద్దేశం. నేనేం తప్పుగా మాట్లాడానని వివరణలు, సవరణలు ఇవ్వాలి. అయినా కూడా ఎవరిని అయినా నా మాటలు ఇబ్బంది పెట్టి ఉంటే చింతిస్తున్నాను అని ఆదినారాయణ రెడ్డి వివరణ ఇచ్చారు.


# ఏపీ విద్యార్థులకు గుడ్‌న్యూస్ చెప్పిన మంత్రి నారా లోకేశ్



స్టార్ త్రినేత్రం, అమరావతి : ఏపీ విద్యార్థులకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుభవార్త చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని వెల్లడించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 2024-25 ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ కోసం రూ.1198 కోట్లను ఆర్థిక శాఖ విడుదల చేసినట్లు వెల్లడించారు. వీటిలో బీసీ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్స్ కు రూ.258.23 కోట్లు, అదనపు నిధుల కింద రూ.477.77 కోట్లు, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.365.07 కోట్లు, మైనారిటీ విద్యార్థులకు రూ.98.92 కోట్లను విడుదల చేసినట్లు మంత్రి వివరంచారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా వేలాది మంది విద్యార్థులకు చదువులో ఆర్థిక భారం తగ్గుతుందని ఆశించారు. ఇకపై విద్యార్థుల చదువులకు ఎలాంటి అడ్డంకులు ఎదురుకావని తల్లిదండ్రులు, విద్యార్థులకు హామీ ఇస్తున్నట్లు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. పెండింగ్ బకాయిలను క్లియర్ చేసి.. భవిష్యత్ లో కూడా సకాలంలో సహాయం అందేలా చూస్తామన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదివితే ప్రభుత్వం ఎప్పుడూ తోడుంటుందని భరోసా ఇచ్చారు.

# 11వ తేదీ.. 11 మంది.. 11 నిమిషాలు ఉండి వెళ్లిపోయారుగా : స్పీకర్

స్టార్ త్రినేత్రం, అమరావతి : చాలాకాలం తర్వాత ఏపీ అసెంబ్లీకి వచ్చిన జగన్.. కొద్దిసేపు మాత్రమే ఉండి వెళ్లిపోయారు. అసెంబ్లీ వాయిదా తర్వాత లాబీలో కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలతో ముచ్చటించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు.. వైసీపీ నేతలపై సరదా వ్యాఖ్యలు చేశారు. 11 మంది ఎమ్మెల్యేలు 11వ తేదీన 11 నిమిషాలు ఉండి వెళ్లిపోయారుగా అని సెటైర్లు వేశారు. పైన ఒక్కటంటే ఒక్క నిమిషం కూడా అసెంబ్లీలో ఉండలేదని వ్యాఖ్యలు చేశారు. సభ్యులు సభా సంప్రదాయాలు పాటిస్తే అందరికీ మంచిదని, వాళ్లు రూల్స్ పాటించకుండా ఇతరులను అనడం మంచిది కాదన్నారు. స్పీకర్ చేసిన వ్యాఖ్యలతో అసెంబ్లీ లాబీలో ఉన్న సభ్యులు నవ్వుకున్నారు.



# జానపద గీతంలో తమన్నా?

ఓ వైపు మహిళా ప్రాధాన్య కథలు.. మరోవైపు ప్రత్యేక పాటలు.. ఇలా వచ్చిన ప్రతి అవకాశాన్ని అందుకుంటూ ప్రేక్షకుల్ని అలరిస్తోంది కథానాయిక తమన్నా. ఆమె, బాలీవుడ్ కథానాయకుడు సిద్ధార్థ్ మల్హోత్రా ప్రధాన పాత్రల్లో 'వీవాన్' అనే చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్.. అనేది ఉపశీర్షిక. దీపక్ మిశ్రా, అరుణభ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఇందులో భాగంగానే ఓ జానపద పాటను చిత్రీకరించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ గీతంలో తమన్నా, సిద్ధార్థ్‌ల స్టెప్పులు అభిమానుల్ని ఆకట్టుకునేలా ఉంటాయని, త్వరలో ముంబయిలో ఈ పాట షూటింగ్ ప్రారంభం కానుందని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. భారతీయ పురాణాలు, జానపద కథల ఆధారంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు.

# ఆ ఆరోపణలు అవాస్తవం



అల్లు అర్జున్ ఎంతో హుందాగా... అందరితోనూ ఎంతో గౌరవప్రదంగా మెలుగుతుంటారని, ఆయనపై ప్రచారమవుతున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమంటూ ఆయన బృందం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. నిరాధారమైన ఆరోపణలు చేసిన వ్యక్తులపై న్యాయపరమైన చర్యలు తీసుకొనేందుకు తమ న్యాయ బృందం ఉపక్రమించినట్టు అందులో తెలిపింది. ఇటీవల విడుదలైన ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో కావేరీ బారువా అనే ఓ బ్రాండ్ స్ట్రాటజర్ మాట్లాడుతూ అల్లు అర్జున్‌తో ప్రకటనల్ని చిత్రీకరించేటప్పుడు 42 రకాల నిబంధనల్ని పాటించాల్సి ఉంటుందంటూ వ్యాఖ్యలు చేసింది. అవి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఆ వ్యాఖ్యల్ని ఖండిస్తూ అల్లు అర్జున్ బృందం ఓ ప్రకటనని విడుదల చేసింది.

# రెండో బ్యాచ్ సిద్ధం

ఆశ మనిషిని బతికిస్తే.. అత్యాశ ఎంతవరకైనా తీసుకెళ్తుందని ఓ మంచి సందేశాన్ని ఇచ్చిన వెబ్‌సిరీస్ 'ఫర్జీ'. బాలీవుడ్ కథానాయకుడు షాహిద్ కపూర్, రాశీ ఖన్నా, విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలు పోషించారు. రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించారు. తాత నెలకొల్పిన పత్రికా కార్యాలయం మూతపడడంతో ఎలాగైనా దాన్ని తెరవాలని నిర్ణయించుకున్న ఓ యువకుడి కథ ఆధారంగా దీన్ని తీర్చిదిద్దారు. ఈ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ విడుదలై మంగళవారంతో మూడేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా దీనికి కొనసాగింపుగా రెండో భాగం రాబోతున్నట్లు సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించారు దర్శకులు. ''రెండో బ్యాచ్ సిద్ధం'' అనే వ్యాఖ్యను జోడించారు. రాబోయే ఈ సీక్వెల్‌లో షాహిద్ తన పాత్ర కోసం ఇప్పటికే శిక్షణ తీసుకుంటున్నారని, త్వరలో చిత్రీకరణ ప్రారంభం కానున్నట్లు తెలిపాయి సిరీస్ వర్గాలు.



# నేను ఎవరి స్థానాన్ని భర్తీ చేయడం లేదు: రూమర్స్‌పై ప్రకాశ్ రాజ్ క్లారిటీ



ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ నటిస్తున్న సినిమాలకు సంబంధించిన పలు వార్తలు ఇటీవల సోషల్ మీడియా వేదిక వైరల్ అవుతున్న సంగతి తెలిసిందే. వాటిపై ఆయన స్పందించి సమాధానమిచ్చే వరకూ వాటికి ఫుల్‌స్టాప్ పడడం లేదు. ఇప్పటికే ప్రభాస్ 'స్పిరిట్'పై క్లారిటీ ఇవ్వగా.. తాజాగా మరో సూపర్ హిట్ సినిమా సీక్వెల్‌పై స్పందించారు. ఆ సినిమాలో తాను ఉన్నట్లు స్పష్టం చేశారు.

'దృశ్యం' సినిమాలు ఇండస్ట్రీలో అన్ని భాషల్లో ఎంతటి విజయం సాధించాయో తెలిసిందే. దీని మూడో భాగం హిందీ వెర్షన్‌లో ప్రకాశ్ రాజ్ నటిస్తున్నట్లు ఎన్నో రోజులుగా వార్తలు వస్తున్నాయి. వాటిపై ఆయన స్పందించారు. తాను ఈ హిట్ ఫ్రాంచైజీలో భాగమైనట్లు చెప్పారు. 'నేను 'దృశ్యం 3'లో కీలకపాత్రలో నటిస్తున్నాను. దీనికి సంబంధించిన షూటింగ్ కూడా ప్రారంభమైంది. మీ అందరికీ నా పాత్ర కచ్చితంగా నచ్చుతుందని భావిస్తున్నా. ఇంకో ముఖ్య విషయం ఏమిటంటే.. నేను ఎవరి స్థానాన్ని భర్తీ చేయడం లేదు' అని ఎక్స్ వేదికగా క్లారిటీ ఇచ్చారు.

'దృశ్యం 3' విషయానికొస్తే.. మలయాళంలో ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తిచేసుకుని విడుదలకు సిద్ధమైంది. అజయ్ దేవ్‌గణ్ హీరోగా అభిషేక్ పాఠక్ దర్శకత్వంలో హిందీ వెర్షన్ రూపొందుతోంది. 2026 అక్టోబర్ 2న ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది.

# జిందగీ నా మిలేగీ దోబారాకి సీక్వెల్ ఉంది కానీ...!



'జిందగీ నా మిలేగీ దోబారా'. బాలీవుడ్ నటులు హృతిక్ రోషన్, అభయ్ దేవల్, ఫర్హాన్ అక్తర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాని జోయా అక్తర్ తెరకెక్కించారు. ఎప్పట్నుంచో ఈ సినిమాకి సీక్వెల్ రానుందని వార్తలు కూడా వస్తున్న సంగతి తెలిసిందే. గతంలోనూ ఓ ఇంటర్వ్యూలో హృతిక్ ఈ సినిమాకి సీక్వెల్ వస్తుంది.. కానీ, ఎప్పుడనేది చెప్పలేమని వెల్లడించారు. అయితే తాజాగా ఈ సీక్వెల్‌కు దర్శకురాలు జోయా అక్తర్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

''జిందగీ నా మిలేగీ దోబారా' సీక్వెల్ తీయాలంటే ఏదైనా కొత్తగా చెప్పడానికి ఉంటేనే ఈ ప్రాజెక్ట్ చేపట్టాలని జోయా ఎప్పుడూ అంటూ ఉండేవారు. ఆమె ఎప్పట్నుంచో ఈ సీక్వెల్‌కు సంబంధించి చేయాలనుకున్న డ్రాఫ్ట్‌ను ఇప్పుడు పూర్తి చేశారు. ఈ చిత్రాన్ని పాత జ్ఞాపకాలను తిరిగి చూపించే కొత్త కథగా కాకుండా.. ఆ ముగ్గురి పాత్రల జీవితాలలో జరిగిన మార్పుల ఆధారంగా రూపొందించాలని అనుకుంటున్నారు. ఈ సినిమాతో మొదటి చిత్రంలోని హీరోలందరినీ తిరిగి కలపాలనేదే ప్రధాన ఉద్దేశం. నటులందరి డేట్స్ సర్దుబాటైతే త్వరలోనే ఈ చిత్రం పట్టాలెక్కనుంది''అని సన్నిహిత వర్గాల సమాచారం. ఇప్పటికే జోయా ఈ సీక్వెల్ గురించి నటులతో చర్చలు చేస్తున్నట్లు సమాచారం.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DHEEKONDA SHIVAKRISHNA, PRINTER TELUKALA BHASKAR REDDY, PRINTED AT RAINBOW OFFSET PRINTERS,6-8-142, SAGARA VEEDHI CHOWRASTHA, HANUMAKONDA, WARANGAL,TELANGANA-506001.PUBLISHED AT: H.NO: 7-37, ZAFFERGADH ROAD, WARDHANNAPET, WARANGAL, TELANGANA- 506313.
EDITOR: DHEEKONA SHIVAKRISHNA. PRGI NO: TGTEL/25/A0438, CELL: 9700950084, 9948206302, email: startrinethram28@gmail.com